క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట కరెంట్ ఉండదని చెప్పారు. పోలకంపాడు, సాయినగర్ కట్ట, ఉండవల్లి సెంటర్ ఇఎస్ఐ హాస్పిటల్ ప్రాంతం, కేఎల్‌రావు కాలనీ, సీతానగరం ఆశ్రమం రోడ్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంకుడు గుంతలపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలో ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. దానిలో భాగంగా వడ్డేశ్వరం గ్రామంలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్. సుప్రియ, వి.జోనితిన్ మాట్లాడుతూ వర్షపు నీటిని, ఇళ్లలో వాడుక నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించడం వలన ఆ నీరు భూమిలోకి చేరి వేసవి కాలంలో బోర్ల ద్వారా మళ్లీ పునర్వినియోగించుకోవచ్చని వివరించామని తెలిపారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ ప్రాతూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్స్‌పై అవగాహన కల్పించామని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం చేకూరుతుందని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనా బేగం అన్నారు. పలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు రెండోవిడత నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.



స్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

వైభవంగా కల్యాణ మహోత్సవం

పట్టణంలోని పాతమంగళగిరిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వార్ల కల్యాణాన్ని కనులారా తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– మంగళగిరి

అక్షయపాత్ర ఫౌండేషన్ సందర్శన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఒకేషనల్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఒకేషనల్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా అక్షయపాత్ర ఫౌండేషన్ పని విధానంపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఒకేషనల్ టీచర్ పి.ఝాన్సీ, కె.కాత్యాయని, పీడీ రవి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే అభివృద్ధి

తాడేపల్లిరూరల్: భారతదేశ అభివృద్ధి విలువలతో కూడిన విద్యతోనే సాధ్యమని శరాఫిమోవ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.సెల్వా అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. వ్యాపారంలో మెలకువలు, ఎథిక్స్ అండ్ కార్పొరేట్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్‌చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఎంబీఏ ఉప విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.బాలాజీ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

తాడికొండ: యువతి అదృశ్యం ఘటన తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కట్టెపోగు భార్గవి(17) ఈ నెల 10వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గ్రామాలు బంధువుల ఇళ్లవద్ద వెదికినా ఆచూకి తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువతి ఎరుపు రంగులో ఉండి 4 అడుగుల ఎత్తు ఉంటుందని, తప్పిపోయిన సమయంలో ఎరుపు రంగు పంజాబీ డ్రెస్సు, ఎరుపు రంగు ప్యాంటు ధరించి ఉందని తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

ఫిరంగిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మండల కేంద్రంలోని సచివాలయం –3 పరిధిలో శుక్రవారం నిర్వహించారు. 425 మందికి పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. మహిళలకు జనరల్ వైద్యపరీక్షలు చేశారు. నలుగురిని ప్రత్యేక వైద్యపరీక్షల కోసం గుంటూరు జీజీహెచ్‌కి రిఫర్ చేశారు.కార్యక్రమంలో వైద్యులు శ్వేత, వందన, గీతాంజలి, సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు అనూష, ఏఎన్ఎం భారతీజ్యోతి, అరుణ పాల్గొన్నారు.



ఆరోగ్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి గీతాంజలి

శ్రీ కృష్ణదేవరాయల జయంతి

మంగళగిరి: పట్టణంలోని నియోజకవర్గ కాపునాడు కార్యాలయంలో శ్రీ కృష్ణ దేవరాయల జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపునాడు సంఘం నాయకులు వేరుకొండ వెంకటరమణ, గాజుల రామ్మోహన్‌రావు, గాదె నాగేంద్రరావు, చెన్నంశెట్టి నాగరాజు, కొప్పురావూరి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.



జయంతి నిర్వహిస్తున్న కాపు సంఘం నాయకులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో శుక్రవారం పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అరిటాకుల శివశంకర్ భార్య, పిల్లలతో కలిసి గురువారం రాత్రి 10 గంటల సమయంలో నివాసంలో నిద్రించాడు. తెల్లవారుజామున ఇంట్లో కాలుతున్న వాసన రావడంతో కళ్లు తెరిచి చూడగా, ఇంట్లో మంటలు వ్యాపించడం చూసి కేకలు వేశాడు. స్థానికులు శివకుమార్‌తోపాటు, ఆయన కుటుంబ సభ్యులను మంటల నుంచి కాపాడారు. శివకుమార్ కాలికి గాయాలు అయ్యాయి. అయితే గ్రామస్తులు సకాలంలో స్పందించడం వల్ల పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్లే జరిగిందని బాధితులు చెబుతున్నారు. నగదు, కొన్ని ముఖ్యమైన పత్రాలు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. బాధితులను మచిలీపట్నం పోర్టు ట్రస్ట్ ఎండీ మేకతోటి దయాసాగర్ పరామర్శించారు. ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ గ్రామ అధ్యక్షుడు శౌరిరెడ్డి జోసఫ్ రెడ్డి, పరమేశ్వరరావు, జయపాల్‌రెడ్డి, రవి, శివరామకృష్ణ, షేక్ అబ్దుల్లా, కిషోర్ ఉన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

మంగళగిరి: దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన 4 శాతం రిజర్వేషన్‌తో ఎంతో మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ తెలిపారు. పట్టణంలోని రాష్ట్ర మైనార్టీ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం రిజర్వేషన్‌లతో డాక్టర్‌లుగా ఉన్నత స్థితికి చేరుకున్న రాజమండ్రికి చెందిన వైద్యులు కమిషన్ చైర్మన్ కలిశారు. ఈ సందర్భంగా వైద్య విద్యనభ్యసించి స్వర్ణపతకాలు సాధించిన వైద్యులు ఎం.షామీరూల్ రహమాన్, ముస్కాన్ బేగం, ఎండీ సానియా బేగం, ఎండీ హలీమా బేగంలను మైనార్టీ కమిషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ జాషువా డానియేలు అదిపి, సభ్యులు షేక్ సైపుల్లా,జితేందర్ జీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్

సెల్ టవర్ ఎక్కి టెన్షన్ పెట్టిన వ్యక్తి

- గుంటూరులోని శ్రీనగర్‌లో సంఘటన
- ఇంటి వద్ద కుళాయి విషయంపై వివాదం
- మనస్తాపంతో సెల్ టవర్‌పై భైఠాయింపు
- సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కిందకు దించిన సీఐ వెంకటేశ్వరరెడ్డి



సెల్‌టవర్ ఎక్కి కూర్చున్న కోటేశ్వరరావు



కిందకు తీసుకువచ్చిన సీఐ వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటి దగ్గర కుళాయి విషయమై ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కిన సంఘటన శుక్రవారం శ్రీనగర్‌లో చోటు చేసుకుంది. శారదాకాలనీ 16వ లైనుకు చెందిన 63 ఏళ్ల వెలగాల కోటేశ్వరరావు తన స్థలంలో రేకుల షెడ్డు నిర్మించుకుంటున్నాడు. నిర్మాణ పనులకు నీరు అవసరం కావడంతో కుళాయి కనెక్షన్ కోసం స్థానిక వార్డు సచివాలయంలో అర్జీ పెట్టుకున్నాడు. అయితే, ఇల్లు లేకుండా కనెక్షన్ ఇచ్చేందుకు వీల్లేదని, కనీసం గోడలపై రేకులు అయినా ఏర్పాటు చేసుకోవాలని సిబ్బంది సూచించారు. దీంతో తన ఇంటి ముందు ఉన్న వాళ్ల ఇంట్లో నుంచి పైపుద్వారా నీటిని తెచ్చుకుని వాడుకుంటున్న నేపథ్యంలో పైపులైను విషయమై పలు వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన కోటేశ్వరరావు శ్రీనగర్ ఏడో లైను చివర్లో భారతి స్కూలు సమీపంలో ఉన్న సెల్ టవర్ సగం వరకు ఎక్కి అక్కడే కూర్చున్నాడు. ఉదయం ఆరు గంటల నుంచి మూడు గంటల పాటు అక్కడే ఉన్న కోటేశ్వరరావుకు ఎంత మంది వచ్చి, సర్ది చెబుతున్నా కిందకు దిగి రాలేదు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట సీఐ ఐ. వెంకటేశ్వరరెడ్డి అక్కడికి చేరుకున్నారు. సెల్ టవర్ ఎక్కిన కోటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి, సమస్య తాను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు దిగి కిందికి వచ్చాడు. కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి ఇబ్బందులకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో అతను శాంతించాడు. ట్యాప్ కనెక్షన్ విషయమై ఆయన అక్కడికి చేరుకున్న నగరపాలకసంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వరరావు, ఏఈ అనూషతో మాట్లాడారు. సీఐ వెంట ఎస్ఐ పి.భాగ్యరాజు ఉన్నారు.

తాగునీటి అవసరాలకు మాత్రమే ట్యాప్ కనెక్షన్ మంజూరు

నెహ్రూనగర్: తాగునీటి అవసరాలకు మాత్రమే ట్యాప్ కనెక్షన్ ఇస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో శుక్రవారం కుళాయి కనెక్షన్ కోసం కోటేశ్వరరావు అనే వ్యక్తి సెల్ టవర్ ఎక్కిన విషయం తెలుసుకున్న కమిషనర్ అక్కడికి ఇంజినీరింగ్ అధికారుల్ని పంపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో శ్రీనగర్‌కు చేరుకున్న ఈఈ కోటేశ్వరరావు సెల్ టవర్ ఎక్కిన వ్యక్తితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటిపై అదనపు గదుల నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో కనెక్షన్ ఇవ్వడం కుదరదని తెలిపారు. ఇంటి నిర్మాణం అనంతరం తాగునీటి అవసరాలకు మాత్రమే ఇస్తామని చెప్పారు.

అభివ్యక్తి నైపుణ్యాల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అభివ్యక్తి నైపుణ్యాల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాల్ని పొందవచ్చని ఏఎన్‌యూ ఆంగ్ల విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్.వి.మంజూష పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ''ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం ఎలా'' అనే అంశంపై ఆంగ్ల భాషా విభాగ ఆధ్వర్యంలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న మంజూష మాట్లాడుతూ డిగ్రీ తరువాత విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నించే క్రమంలో ఒక్కోసారి కొన్ని కారణాల వల్ల విజయం సాధించలేకపోతున్నారని, దాన్ని అధిగమించేందుకు కొన్ని ప్రత్యేక లక్షణాల్ని కలిగి ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు వేషధారణతో పాటు చక్కటి రెజ్యూమ్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సరళమైన భాష, భావ వ్యక్తీకరణ, నవ్వుతూ పలకరింపు వంటి అంశాలు ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని వివరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరణ చెందాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి వారిలో ఆత్మ విశ్వాసం నింపారు. సాధనతో ఎంతటి కార్యాన్నైనా సునాయాసంగా అధిగమించవచ్చునని వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ ఎన్. చక్రనాగ్, కళాశాల ఆంగ్లవిభాగాధిపతి పి. నాగమణి, అధ్యాపకులు జి. భాగ్యమ్మ, డాక్టర్ సుధీర్ కుమార్, జయ శైలజ, అంజనీ కుమార్, సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ మంజూష

పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పెనుమూలి(తాడేపల్లిరూరల్): పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నట్లు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ పేర్కొన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వైద్యరంగంలో దేశంలో ఎక్కడా లేని విధంగా మార్పులు తీసుకువచ్చి పేదలకు వైద్యం అందుబాటులో తెచ్చినట్లు చెప్పారు. అనంతరం గతంలో కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, వైద్యులు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, శ్రావణ్ కుమార్, శ్వేత, వి.వి.కర్ణ పాల్గొన్నారు.



వైద్యులతో చర్చిస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ అరుణ

తాడేపల్లిలో కార్మికుల ప్రదర్శన

తాడేపల్లిరూరల్: పారిశ్రామిక సమ్మెలో భాగంగా కార్మికులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, పీకేఎస్ ఆటో వర్కర్స్ యూనియన్, లారీ వర్కర్స్ యూనియన్ కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ అధికారంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను తీవ్ర సంక్షోభంలోని నెట్టి నల్లచట్టాలు తీసుకురావడం, దానిపై పోరాడిన రైతుల్ని అంతమొందించడం, రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేయడం, కార్మిక చట్టాలను మార్చి కార్పొరేట్లకు దోచిపెడుతోందని మండిపడ్డారు. క్రిమినల్ చట్టం 106 (1) (2) రద్దు చేయాలని, మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 209 జీవో 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతం రూ.26,000 రూపాయలు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్‌రావు, ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు కంచర్ల కాశయ్య, తుడిమెల్ల వెంకటయ్య, మునగాల రామారావు, దొంతి కోటేశ్వరరావు, కాశీం, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ శ్రీను, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు లాజర్ పాల్గొన్నారు.

పంచకర్మ థెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ యునాని, న్యాచురోపతి యోగ వైద్యశాలలో పంచకర్మ థెరపిస్ట్ (రిజిమెంటల్ థెరపీ)గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ రావూరి మౌనిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ డిగ్రీ లేదా ఫిజియోథెరపీ కోర్సు చేసి అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన వారు ప్రతిరోజూ నాలుగు గంటలు పని చేయాలని, నెలకు గౌరవ వేతనంగా రూ. 10వేలు ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 8309599643 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.